



పసిడి పరుగులు..

- అల్ టైం రికార్డును సృష్టించిన బంగారం
- జిల్లా మార్కెట్‌లో 10 గ్రాముల బంగారం రూ.లక్షా 1600
- పెళ్లిల సీజన్ మొదలు కావడంతో మరింత పైపైకి..
- జిల్లాలో కొనుగోళ్లు భారీగా తగ్గాయంటున్న నగల వ్యాపారులు



ఆదిలాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఎంతో ఇష్టమైన పసిడి పరుగులు తీస్తోంది. రోజురోజుకు బంగారం ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఎన్నడూ లేని విధంగా ఈ యేడాదిలోనే రూ.20 వేలకు పైగా ధరలు పెరగడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. దీంతో మహిళల నోట బంగారం మాట వినిపించడం లేదు. పెరిగిన ధరలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు జంకుతున్న పరిస్థితి ఏర్పడుతోంది. చరిత్రలోనే తొలిసారిగా 10 గ్రాముల బంగారం ధర లక్ష రూపాయలను దాటింది. దేశీయ మార్కెట్‌లో మంగళవారం పది గ్రాముల మేలిమి బంగారం ధర రూ.లక్షా 1600లు పలికింది. ప్రస్తుతం వివాహాలు, శుభకార్యాల సీజన్ ఊపందుకుంది. గత కొద్ది రోజులుగా బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్నా డిమాండ్ మాత్రం తగ్గడం లేదంటున్నారు. ఇదే సమయంలో బంగారం ధరలు అమాంతంగా పెరగడంతో బంగారాన్ని కొనేందుకు ఒకటికి పది సార్లు ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఒకవేళ కచ్చితంగా బంగారాన్ని కొనాల్సి వచ్చినా కొంత వెనక్కి తగ్గి మాసం బంగారం జోలికి వెళ్లడం లేదు. ఈ యేడాది ప్రారంభం నుంచి బంగారం ధరలను పరిశీలిస్తే దాదాపు 26 శాతం పెరిగినట్లు తెలుస్తుంది. గతేడు రూ.60 నుంచి రూ.70 వేల మధ్య ఉన్న బంగారం ధర.. ఇప్పుడు ఏకంగా లక్ష రూపాయలు దాటడంతో.. జిల్లాలో వామ్మో బంగారం ధరలు అంటూ సర్వత్రా బెంబెలెత్తి పోతున్నారు.



రికార్డు స్థాయిలో ధరలు

అంతర్జాతీయ మార్కెట్లో హెచ్చుతగ్గుల కారణంగా బంగారం ధరలు రికార్డు స్థాయిలో పెరిగి పోతున్నాయి. గత కొద్దిరోజులుగా పసిడి ధరలు వేగంగా పెరుగుతున్నాయి. ఆదిలాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,01,600లు పలుకుతోంది. మాసం బంగారం ధర రూ.10,160కి చేరింది. పెరిగిన ధరలతో కొనుగోళ్లు భారీగా పడిపోతున్నాయంటూ జ్యువెలరీస్ వ్యాపారులు పేర్కొంటున్నారు. పెరిగిన బంగారం ధరలు మహిళలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మాసం బంగారం కొనాలన్న ధైర్యం కావడం లేదని మహిళలు చెబుతున్నారు. అసలు కొన్నాళ్ల పాటు బంగారం జోలికి వెళ్లకపోవడమే మంచిదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో జ్యువెలరీస్ బంగారు ఆభరణాల షాపులు వినియోగదారులు లేక వెలవెలబోతున్నాయి. మరికొన్నాళ్ల పాటు ఇవే పరిస్థితులు ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు.

పెళ్లిళ్లకు బంగారం భారం

పెళ్లిల సీజన్, ముహూర్తాలు ప్రారంభంకావడంతోనే బంగారం ధరలు మరింత పైపైకి వస్తున్నాయి. ఇక బంగారం కొనే పరిస్థితులు లేవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ముహూర్తాలు ఖరారు చేసుకున్న కుటుంబాల్లో బంగారం ధరలు గుబులు పుట్టిస్తున్నాయి. గతంలో ధరలకు అనుగుణంగా బంగారు కట్నకానులను చెల్లించేందుకు ఒప్పందం చేసుకున్నారు. కానీ ఏకంగా ధరలు రూ.లక్షను దాటిపోవడంతో అందరి అంచనాలు తలకిందులవుతున్నాయి. సాధారణంగా వేసవిలోనే పెళ్లి ముహూర్తాలు ఎక్కువగా ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ధరలు అమాంతంగా పెరగడం అందరినీ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గతంలో తులం పెట్టేందుకు సిద్ధమైన వారు ప్రస్తుతం ధరల పెరుగుదలతో

(తరువాయి 6వ పేజీలో...)

ప్రస్తుతం బంగారాన్ని కొనే పరిస్థితి లేదు

: శ్రీదేవి, గృహిణి, కైలాస్‌నగర్, ఆదిలాబాద్



ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో బంగారాన్ని కొనే పరిస్థితి లేదు. ముఖ్యంగా సామాన్య మధ్యతరగతి వారికి ధరలు అందుబాటులో లేవు. మునుపెన్నడూ లేని విధంగా బంగారం ధరలు విపరీతంగా పెరిగి పోతున్నాయి. సామాన్యులు పెళ్లి చేయాలంటే భయపడే పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వం బంగారం ధరలపై ప్రత్యేకదృష్టిని సారించాలి. అందరికీ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి.

అడిగే వారే తప్ప.. కొనే వారే లేరు

: కోటోజి వెంకటచారి, స్వర్ణకారుడు, ఆదిలాబాద్



బంగారాన్ని అడిగే వారే తప్ప కొనేవారే లేకుండా పోయారు. నగల వ్యాపారం భారీగా పడిపోవడంతో స్వర్ణకారుల బతుకులు ఆగమవుతున్నాయి. నగల తయారీనే నమ్ముకుని జీవిస్తున్న కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం కనిపిస్తుంది. పరిస్థితులు ఇలా ఉంటే బతుకుడు ఎలానో అర్థం కావడం లేదు. పెళ్లిల సీజన్‌లోనూ పనిలేకుండా పోతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బంగారం ధరలను అదుపు చేసి అందుబాటులోకి తీసుకురావాలి.

ప్రతీ వాహనంలో డాష్ కెమెరాల ఏర్పాటు

- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- పోలీసు వాహన డ్రైవర్లకు శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రతీ వాహనంలో డాష్ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, వాటిని సరైన విధంగా పద్ధతిలో ఉంచుకోవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసు హెడ్‌క్వార్టర్స్ సమావేశ మందిరంలో మోటార్ వెహికల్ కార్యాలయంలోని జిల్లా పోలీసు అధికారుల వాహనాలకు, జిల్లా పోలీసు డ్రైవర్లకు శిక్షణ తరగతుల కార్యక్రమంలో పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ డాష్ కెమెరాలు ప్రమాదాలు సంభవించినప్పుడు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అదే విధంగా హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ప్రతీఒక్కరికి సమానమైన పనిని కల్పిస్తూ, ఎవరి పై పక్షపాతం చూపించకుండా ఉండాలని అధికారులకు సూచించారు. వాహనాలను పార్కింగ్ స్థలాలలో మాత్రమే పార్కింగ్ చేయాలని అనవసరంగా రోడ్లపై, ఇతర ప్రదేశాలలో పార్కింగ్ చేయకుండా చూడాలన్నారు. ప్రతీ ఒక్క వాహన డ్రైవర్‌కి వాహనం గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి సమస్యలు తలెత్తిన ప్రాథమికంగా అంచనా వేసే విధంగా వాహనం సాంకేతికతను తెలుసుకుని ఉండాలన్నారు. పోలీసు స్టేషన్‌లో ఉండే ఒక వాహనానికి ఇద్దరు డ్రైవర్ల చొప్పున కేటాయించడం జరిగిందన్నారు. వాహనం డ్రైవర్లందరికీ సమాన పనిని కల్పించాలని అధికారులకు సూచించారు. పోలీసు స్టేషన్‌లో డ్రైవర్లు ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనవద్దని, పోలీసు స్టేషన్ అధికారులు సూచించిన అనవసరమైన పనులలో తలదూర్చకుండా ఉండాలని తెలిపారు. వాహన నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లకు ప్రశంస పత్రాలు నగదు రివార్డులను అందజేసి ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. వాహన నిర్వహణ, పరిశుభ్రతపై ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. పోలీసు స్టేషన్‌లో ఉన్న బ్లూకోర్ట్, డయల్ 100 వాహనాలను సైతం పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డి.వెంకటి, ఎంటీఓటి మురళీ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హిమబిందు

పోషకాహారంతో చిన్నారుల ఎదుగుదల

- పోషణ్ పక్వాడ్‌లో వైద్యురాలు హిమబిందు

ఇచ్చోడ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): చిన్నారుల ఎదుగుదలకు పోషకాహారమే దివ్యౌషధమని నర్సాపూర్ పీహెచ్‌సీ వైద్యురాలు హిమబిందు అన్నారు. మండలంలోని నర్సాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ్ పక్వాడ్ కార్యక్రమం మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్యురాలు మాట్లాడుతూ.. అందుబాటులో ఉన్న మునగ, చింతచిగురు, అరటిపండ్లు, జామ, సీజనల్‌గా లభించే పండ్లు, కూరగాయలు, ఆకుకూరల్లో మంచి పోషకాలు ఉంటాయాని, వాటిని నిత్యం తీసుకోవడంతో చిన్నారుల్లో ఎదుగుదల, మానసికస్థితి మెరుగ్గా ఉంటుందని వివరించారు. అనంతరం గ్రామంలోని 11 మంది బాలింతలకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విమల, హెల్త్ సూపర్‌వైజర్ రాజేశ్వరీ, అంగన్‌వాడీ టీచర్ ఆశ, తదితరులున్నారు.

నేడు భూ భారతిపై అవగాహన సదస్సు

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టంపై బుధవారం మండల కేంద్రంలోని స్థానిక మార్కెట్ యార్డులో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదస్సుకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్, డీఆర్డీఏ పీడీ, మండల ప్రత్యేకాధికారి రాథోడ్ రవీందర్, హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని, రైతులు విజయవంతం చేయాలని కోరారు.

ఉట్నూర్: మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో బుధ వారం ప్రభుత్వం అమలు చేస్తున్న భూభారతిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని ప్రజలు, రైతులు, ప్రజాప్రతినిధులు, రైతు కూలీలు హాజరు కావాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్ బదులుగా కొత్త భూ భారతి ఆర్ఓఆర్ యాక్ట్ 2025 భూమి హక్కు భద్రత, భూ సమస్యల సత్వర పరిష్కారం మరియు రైతు మేలు కోసం ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కేబీ కాంప్లెక్స్ పీఎంఆర్ సీ భవనంలో రైతు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. భూ సమస్యలు ఏవైనా ఉంటే రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించబడుతాయని తహసీల్దార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మంజూరైన 'ఇందిరమ్మ ఇళ్ల' పరిశీలన

నేరడిగొండ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగమల్యాల్, పీచర గ్రామాలలో ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్లను ఎంపీడీవో రాజ్‌వీర్ పరిశీలించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రతీ ఒక్క లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేసుకోవాలని కోరారు. ఇందులో ఎంపీవో లక్ష్మణ్, పంచాయితీ కార్యదర్శి రవికిరణ్, పవన్, తదితరులు ఉన్నారు.

బోథ్: మండలంలోని రఘునాథ్ పూర్, కందిపల్లి, నారాయణపూర్, అందూర్, కుచిర్యాల తండా గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ద్వారా ఎంపిక చేసిన అర్హుల జాబితాలో వారి స్థితిగతులను మంగళవారం ఎంపీడీవో రమేష్ పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడడం జరిగింది. ఆర్థిక స్థితిగతులను పరిశీలించి, సాధ్యమైనంత త్వరలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో గిరిజన విద్యార్థికి 68వ ర్యాంకు

- అభినందించిన డీజీపీ



సాయిచైతన్య జాదవ్

ఉట్నూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్‌కు చెందిన గిరిజన యువకుడు సాయిచైతన్య యూపీఎస్సీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియాలో 68వ ర్యాంకు సాధించి ఐఏఎస్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఉట్నూర్‌కు చెందిన పోలీసు ఉద్యోగి హెడ్ కానిస్టేబుల్ జాద వ్ గోవింద్, ప్రభుత్వ ఉపాధ్యాయు రాలు కవిత కుమారుడు సాయి చైతన్యజాదవ్ ఐదవ ప్రయత్నంలో యూపీఎస్సీ పరీక్షలో 68వ ర్యాంకు సాధించారు. గతంలో నాలుగో ప్రయత్నంలో 138వ ర్యాంకు సాధించి ఐఎఫ్ ఎస్‌కు ఎంపిక కాగా, ఐదవ ప్రయత్నంలో ఐఏఎస్ సాధించ డంతో తల్లిదండ్రులతో పాటు సహచర పోలీసు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఐఏఎస్‌గా ఎంపిక కావాలన్నా సాయిచైతన్య జాదవ్ కల ఎట్టకేలకు నెరవేరిందని తల్లిదండ్రు లు తెలిపారు. వీరి కూతురు శృతి వైద్యురాలుగా విధులు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా జాదవ్ గోవింద్ ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాలోని డిచ్‌పల్లి పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కాగా, సాయిచైతన్యను రాష్ట్ర డీజీపీ జితేందర్ ప్రత్యేకంగా అభినందించారు.

రేపు ప్రత్యేక ప్రజావాణి

ఉట్నూర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో రాంప్రసాద్ తెలిపారు. మండల ప్రత్యేక అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో జరగనున్న ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

బేలలో డిగ్రీ పరీక్ష కేంద్రం కొనసాగించాలి

బేల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని యధావిధిగా కొనసాగించాలని ఏబీవీపీ నాయకులు కీర్తన డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి వినతి పత్రం అందజేశారు. మంగళవారం మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడానికి వచ్చిన ఎంపీ ఎమ్మెల్యేకు మండల కేంద్రంలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయకుంటే విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలను వారికి వివరించారు. కాకతీయ యూనివర్సిటీ అధికారులతో మాట్లాడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిగ్రీ పరీక్ష కేంద్రం యధావిధిగా కొనసాగేలా చూస్తామని ఎంపీ, ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మాడవార్ హరీశ్ రెడ్డి, పొత్ రాజ్ శ్రీకాంత్, పవన్ రెడ్డి, కన్నె సాయి రెడ్డి, డిగ్రీ విద్యార్థులు శ్వేత, రాజేశ్వరి, సాయి చరణ్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

'సభను విజయవంతం చేయాలి'

ఉట్నూర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల మే ఒకటిన మే డే పురస్కరించుకొని మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటి ఆవరణలో, మున్సిపల్, గ్రామ పంచాయతీ కార్మికుల బహిరంగ సభను జయప్రదం చేయాలని మున్సిపల్ గ్రామ పంచాయతీ కార్మికుల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దేవిసత్యం కోరారు. మండల కేంద్రంలో బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మే 1న మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయం ముందు జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. చాలీచాలని జీతాలతో దుర్భర జీవితం గడుపుతున్న గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ కార్మికులకు కనీస వేతనాలు రూ.30 వేలకు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, తదితర డిమాండ్లతో నిర్వహిస్తున్న బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. ఇందులో రాష్ట్ర కోకన్వీనర్ బానోతు రామారావు, మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ కార్మికులు, ఆవునూరి గోపాల్, కోకిల శ్రీనివాస్, నవీన్, తదితరులున్నారు.

ప్రతీ సమస్యకు భూభారతిలో పరిష్కార మార్గం

- జిల్లా కలెక్టర్ రాజార్షిషా
- బోథ్, సోనాల మండలాల్లో భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమం
- పాల్గొన్న జిల్లా అధికారులు



సోనాలలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా



దన్నూర్ గ్రామంలో హాజరైన ప్రజలు

బోథ్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): భూముల సమస్య పరిష్కారానికి భూభారత్ చట్టం ఎంతగానో ఉపకరిస్తుందని, ప్రతి సమస్యకు భూభారతిలో పరిష్కార మార్గం ఉందని జిల్లా కలెక్టర్ రాజార్షిషా పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దన్నూర్ గ్రామంలో భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి దన్నూర్ గ్రామ ప్రజలతోపాటు చుట్టుపక్కల గ్రామాల రైతులు హాజరయ్యారు. భూభారతి చట్టం ద్వారా ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారం గాని సమస్యలు పరిష్కరించే ఆస్కారం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. గతంలో పాసుబుక్కులను రైతులకు సంబంధించిన భూమి నమోదు అయి ఉండి కొత్త పాస్ బుక్‌లో రైతు పేరు నమోదు కాకుండా భూమి లేకుండా ఉంటే సమస్యను పరిష్కరించే ఆస్కారం ఉందన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం సివిల్ కోర్టుల చుట్టూ తిరిగే పద్ధతికి స్వస్తి చెప్పి తహసీల్దార్, ఆర్డీవో, జెసి, కలెక్టర్ల వద్దనే భూ సమస్యలకు పరిష్కారం లభించే ఆస్కారం ఏర్పడిందన్నారు. రైతుల సాగు చేసే ప్రతి భూమికి కొలతలతో పాటు ఐడీ నెంబర్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. భూముల కొలతలకు సంబంధించి మ్యాపును తయారు చేసేందుకు లైసెన్స్ సర్వేయర్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. భూధార్ భూభారతి హోటల్ సులభమైందని పోర్టల్ ప్రభుత్వ ఆధీనంలో ఉండడంతో సమస్యలను పరిష్కరించే ఆస్కారం ఉందన్నారు. పైలట్ గ్రామాలలో రెవెన్యూ సంస్థలను నిర్వహించడం తద్వారా సాధ్యమైనంత వరకు సత్వరమే భూ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. అలాగే, అనేక గ్రామాల్లో రైతులు తమ చేలకు వెళ్లే పొలాల బాటల సమస్యలు తమ దృష్టికి రావడం జరిగిందని, అయితే రైతులకు ఇబ్బందులు కలగకుండా భవిష్యత్తులో పొలాలకు వెళ్లే బాటలపై తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జెసి శ్యామల దేవితో పాటు ఆర్డీవో బోథ్ మండల ప్రత్యేక అధికారి డిఎస్ఓ మార్కెట్ కమిటీ చైర్మన్ బి.గంగారెడ్డి, తహసీల్దార్ సుభాష్ చంద్ర, ఎంపీడీవో రమేష్‌తోపాటు పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

- భూభారతి చట్టంతో రైతులకు మేలు

సోనాల: భూభారతి చట్టం-2025 ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భూభారతి చట్టంలో తహసీల్దార్ స్థాయి నుంచి సీసీఎల్ ఏ స్థాయి వరకు సమస్యలను పరిష్కరించే వెసులుబాటు ఉన్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీఓ వినోద్‌కుమార్, ఎంపీడీఓ రాజేశ్వర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాధికార యుద్ధం చేయాల్సిందే..'

జైనథ్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాలు అగ్రకుల రాజకీయ నాయకులపై రాజ్యాధిక యుద్ధం చేయాల్సిందేనని బీసీ ఎస్సీఎస్టీ, జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. మంగళవారం జైనథ్ మండలం కరంజి(కె)లో లక్ష కిలో మీటర్ల మా భూమి రథయాత్రలో భాగంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. భూమి రాజ్యం సంపద కేవలం 10 శాతం లేని రెడ్డి, వెలమ, దొరల వద్ద ఉంటే.. 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ ఎస్టీల దగ్గర మట్టి మిగిలిందన్నారు. కరంజి గ్రామంలో గడపగడపకు తిరిగి అందరితో మాట్లాడారు. వారి కష్టసుఖాల్ని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లోని గృహాలను సందర్శించారు. వానలకు పడిపోయేలా ఇళ్లు ఉన్నాయని, పేదలను గుర్తించ లేని కలెక్టర్ దండగా అని ధ్వజమెత్తారు. ప్రజా సమస్యలను గుర్తించి ప్రభుత్వంతో పోరాడి సాధిస్తామన్నారు. బీసీఎస్సీ ఎస్టీ జేఏసీ ధర్మ సమాజ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్, బిక్కిపొచ్చన్న, దర్శనాల నగేష్, జిల్లా ఉపాధ్యక్షురాలు దర్శనాల సుష్మ, శ్యామల, దివ్యవాణి, గంగన్న, నవీన్, తదితరులున్నారు.



కరంజి(కె)లో పర్యటిస్తున్న డాక్టర్ విశారదన్ మహరాజ్

'అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలి'

ఉట్నూర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీర్సాయిపేట అటవీ రేంజ్ కార్యాలయం ముందు అధికార పార్టీకి చెందిన నాయకులు, తునికి ఆకు కూలీలు మంగళవారం ధర్నా నిర్వహించారు. బీడీ కార్మికులను వేధించడం మానుకోవాలని డిమాండ్ చేశారు. గత ఆదివారం బీడీ కార్మికులు బీడీ ఆకుల తీసుకు రావడానికి అటవీ ప్రాంతానికి వెళ్లారని, ప్రధాన రోడ్డు పక్కన తునికి ఆకు సేకరిస్తున్న సమయంలో అటవీ శాఖ బీట్ అధికారి అశోక్ సేకరించిన తునికి ఆకును ఉంచిన ఆటోను తీసుకొని వచ్చి రేంజ్ కార్యాలయంలో పెట్టి ఆటో డ్రైవర్‌తో పాటు మహిళా బీడీ కార్మికులపై కేసు పెడతాం అని బెదిరించి ఆకు మొత్తం తీసుకొని ఆటోను రేంజ్ కార్యాలయంలో పెట్టడం చాలా బాధాకరం అన్నారు. అధికారులు పట్టుకున్న ఆటోను వెంటనే విడుదల చేయాలని, తునికి ఆకు కూలీలను వేధించవద్దని అన్నారు. ఈ సందర్భంగా బీడీ కార్మికులను న్యాయం చేయాలని అధికార పార్టీ నాయకులు ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, టీపీసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మొహమ్మద్ ముబిన్, భాస్కర్‌లు అన్నారు. బీర్సాయిపేట గ్రామ అధ్యక్షుడు రాజేశ్ అఫ్రోజ్, మాజీ ఉప సర్పంచ్ సిరాజ్‌లు పాల్గొన్నారు. ఈ విషయమై ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ అరుణతో మాట్లాడగా తునికి ఆకు మూటలను తరలిస్తున్న ఆటోను బీట్ ఆఫీసర్ పట్టుకొని రేంజ్ కార్యాలయానికి అప్పగించారు. అంతేకాకుండా అటవీ శాఖ నిబంధనల ప్రకారం కవ్వాల్ టైగర్‌జోన్‌లో తునికి ఆకు సేకరణను ప్రభుత్వం నిలిపి వేసింది. అక్రమంగా బీడీ ఆకు రవాణా చేస్తున్న ఆటోను పట్టుకొని కేసు చేసి జరిమానా కట్టి ఆటో తీసుకు వెళ్లాని బాధితులకు చెప్పడం జరిగిందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

SVJC, The exemplary of Success in Inter Results

Sr. BiPC 994 E. Dileep H.No. 2535201673

Sr. BiPC 992 J. Padmasri H.No. 2535207675
Sr. BiPC 992 D. Spoorthi H.No. 2535206405
Sr. MPC 992 P. Likitha H.No. 2535202087
Sr. MPC 992 M. Spurthi H.No. 2535211968
Sr. MPC 991 S. Rishika H.No. 2535210616
Sr. MPC 989 T. Likhith Goud H.No. 2535201801
Sr. BiPC 989 K. Rohini H.No. 2535210333
Sr. BiPC 988 E. Harshitha H.No. 2535202216
Sr. MPC 988 R. Meghana H.No. 2535203787
Sr. MPC 988 K. Karthik H.No. 2535204588
Sr. MPC 987 S. Lavanya H.No. 2535204656
Sr. MPC 987 M. Thrinija H.No. 2535200960
Sr. MPC 987 S. Rakshitha H.No. 2535206885
Sr. CEC 968 M. Vaishnavi H.No. 2535201530

Jr. MPC 468 Ch. Rajashekar Reddy H.No. 2535109035

Jr. MPC 466, Jr. MPC 466, Jr. MPC 465, Jr. MPC 464, Jr. MPC 464, Jr. MPC 463
Jr. MPC 463, Jr. MPC 462, Jr. MPC 462, Jr. MPC 462, Jr. BiPC 437, Jr. BiPC 437
Jr. BiPC 435, Jr. BiPC 434, Jr. BiPC 434, Jr. BiPC 432, Jr. BiPC 431, Jr. BiPC 430

and many more...

SVJC
SRI VENKATESHWARA JUNIOR COLLEGES
970 471 9111, 91770 11160, 98489 51775, 970 471 4111
BOYS CAMPUS : Matha Manikeshwari Complex, Railway Station Road, Karimnagar. Ph : 8978511090, (College Code: 35202)
GIRLS CAMPUS: Vavilalapally, Karimnagar. Ph : 0878-2222449, (College Code: 35212)

ప్రభుత్వ ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలి : డీఈవో

జైనథ్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలోని ఆయా గ్రామాలలో గల ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలని ఆదిలాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం జైనథ్ ఉమ్మడి మండలంలోని మేడిగూడ ఆర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కొనిగేల నారాయణ పదవి విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంకిత భావం సమాజ సేవ పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కొనిగేల నారాయణ దంపతులను మేడిగూడ ఆర్ గ్రామ ప్రజలు పాఠశాల సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ క్యాతం రాంరెడ్డి, సాత్నాల తహసీల్దార్ విశ్వనాథ్, మాజీ సర్పంచ్ సీమాశ్యాంసుందర్, కాంప్లెక్స్ హెచ్‌ఎం సంజీవ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ అనివార్యం : ఎంపీ

సోనాల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ అనివార్యం అని, వృత్తిలో ఉన్నప్పుడు చేసిన సేవలే చిరకాలం గుర్తుండి పోతాయని ఎంపీ గోడంనగేష్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన కచ్చకాయల దశరథ్ బంజారాతండాలోని పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించి ఇటీవల పదవీ విరమణ పొందారు. కాగా, మంగళవారం పదవీ విరమణ మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ నగేష్ దశరథ్ దంపతులను శాలువాతో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు అనుకున్న లక్ష్యాలు సాధించాలంటే కేవలం ఉపాధ్యాయులతోనే సాధ్యమన్నారు. శేష జీవితా న్ని సుఖమయంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. అలాగే వివిధ ఉపాధ్యాయ సంఘాలు ఉపాధ్యాయులు బంధుమిత్రులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి హన్సేన్, ఉపాధ్యాయులు, వివిధ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య

ఇంద్రవెల్లి , ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): భర్త, అత్త వేధింపులు తాళలేక వివాహిత మహిళ పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మండల కేంద్రంలోని మిలింద్ నగర్ కాలనీకి చెందిన జోందలే ధర్మేందర్‌కు కరీంనగర్ కి చెందిన శిరీష(22)తో సంవత్సరం క్రితం వివాహమైంది. భర్త జోందలే ధర్మేందర్, అత్త జోందలే వచ్చెలబాయి తరచూ అనుమానంతో శారీరకంగా, మానసికంగా వేధింపులతో హింసిస్తున్నాడు. జీవితంపై విరక్తిచెందిన శిరీష మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి వద్ద పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యులు గమనించి స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు సూచన మేరకు కరీంనగర్ లోని ఆసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. మృతిరాలు తండ్రి మునేశ్వర్ సీతారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

కరెంట్ సమస్యలపై గరం గరం

● భీంపూర్‌లో అధికారుల తీరుపై వినియోగదారుల ఆగ్రహం

భీంపూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మూడు మండలాలకు సంబంధించి మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధికారుల తీరుపై వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని నిపాని గ్రామంలో విద్యుత్ పోల్ అవసరం ఉందని, రాజులకొరి ప్రాంతానికి సంబంధించి మరో డీటీఆర్ కావాలని తాంసి మండలం పొన్నారి నుంచి ప్రొటోకాల్ మెంటెన్ చేయాలని, తలమడుగు మండలంలో రాంరెడ్డి అనే వినియోగదారుడు డీడీ కట్టిన కనెక్షన్ ఇవ్వలేదని తదితర సమస్యల గురించి పరిష్కార వేదిక ప్రస్తావన తెచ్చింది. ప్రధానంగా రైతులకు త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా గురించి నిలదీశారు. మొత్తంగా ఎనిమిది ఫిర్యాదులు రాగా అందులో నాలుగు చిన్న సమస్యలను తొందర్లో పరిష్కరిస్తామని మిగతా నాలుగు ఫిర్యాదులను నమోదు చేసుకోవడం జరిగిందని వినియోగదారుల సమస్య వేదిక చైర్మన్ నారాయణ తెలిపారు.



జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే



పాఠశాల వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల శంకర్

పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తున్న కేంద్రం

● ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్

జైనథ్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): దేశంలో రైతులు పండించిన వివిధ పంటలకు కేంద్రంలో అధికారంలో ఉన్న పీఎం నరేంద్రమోదీ బీజేపీ ప్రభుత్వం గిట్టుబాటు ధరలను కల్పిస్తుందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్‌లు అన్నారు. మంగళవారం జైనథ్ మండల కేంద్రంలో గల వ్యవసాయ మార్కెట్ ఆవరణ నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా చేపట్టి జొన్నల కొనుగోలు కేంద్రాన్ని అధికారులు నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ మంత్రులతో కలిసి ఎకరానికి 14 క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేసే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. జైనథ్ మండలాన్ని మరో అంకాపూర్ మార్చే విధంగా సాత్నాల ప్రాజెక్టు లోయర్ పెన్‌గంగా కోర్టా-చనకా బ్యారేజ్‌ల ద్వారా సాగునీరు పూర్తి వరకు సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, పప్పుదినుసుల సాగు విషయంపై రైతులను ప్రోత్సహించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ఇందులో పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్ధన్, మార్కెట్ చైర్మన్ ఎ.అశోక్‌రెడ్డి, జైనథ్ సీఈవో జి.గంగన్న, మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ ఆత్రం నారాయణ, ఏవో పూజ, తదితరులు పాల్గొన్నారు.

● విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

జైనథ్: విద్యార్థులు జీవితంలో అనుకున్న ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఎమ్మెల్యే పాయల శంకర్, ఎంపీ గోడం నగేష్‌లు అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన జైనథ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇందులో శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం మద్దిలస్మన్న, బీజేపీ మండల అధ్యక్షుడు ఎల్.కరుణాకర్‌రెడ్డి, నాయకులు అష్టక్ సుభాష్, మాజీ ఉప సర్పంచ్ రాకేష్ రెడ్డి, చైర్మన్ వెంకటమ్మ, తదితరులున్నారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన ఎస్ఆర్ విద్యార్థులు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో బైపీసీ నుంచి వెయ్యి మార్కులకు గాను ఎంజెల్ కాలమడుగుల 993, దివ్య వైలే 991, హరిణి లోక 990, కావిడె యోగేష్ 990, పగిడి బుద్ధ తేజ 987, జి.సౌమిక 984, సమర్ ఫిరదౌసి 984, నిరూప 981, బి.సాయి ప్రసన్న 980, ఎంపీసీ నుంచి టి.లాక్షణ్య 991, హిమబిందు కంది 991, సదలి ప్రణయ్ 991, కొటోజు పద్మావతి 990, చారిత్రిక కుంట 989, అస్మిత చౌహాన్ 988, ఎ.శరణ్య 987, మేఘన జాదవ్ 986, పల్లవి కోవా 986, కనపర్తి వీణ 986, సిరిగిరి జనార్ధన్ 986, కీర్తి గడ్డం 983, మార్కులు సాధించారు.మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో 470 మార్కులకు గాను అనగందుల అభిషేక్ 466, రాపెల్లి శివ కుమార్ 466, నిమ్మల అంజన్‌రెడ్డి 465, పెంట తేజశ్రీ 465, మొలుగూరి సాహితి 465, ఉగ్గె రాజు 464, అనగందుల అశ్విత 463, అందే మాగేగునా 462, ప్రహర్షిని రావు ఆల్వాల్ 461, కె.అనుష్క 461, పిస్సంవారి ఓంకార్ 461, జక్కుల అఖిల్ 461, కావడి తనీష్ యాదవ్ 461, బైపీసీలో 440 మార్కులకు గాను అక్షయ బోయర్ 436, జుంగారే సరబ్జీత్ కౌర్ 434, గుట్ట సుమిత్ 434, వాగ్మారే నిఖిత 433, నిఖిత గోతి 432, ఆర్షియా మెహ్రీన్ 432, అక్షర గోడ్సే 431, ప్రితి కోడె 431, బెజ్జారపు వర్ష 431 సాధించి ఆదిలాబాద్‌లోనే అత్యుత్తమ ఫలితాలు నమోదు చేశారు. మొతంగా 95 శాతం ఉత్తీర్ణతతో ఆదిలాబాద్‌లోనే నెం.1 కళాశాలగా నిలిపి ఆదిలాబాద్‌లో కూడా హైదరాబాద్ కంటే మెరుగైన ఫలితాలను సాధించ వచ్చని నిరూపించిన విద్యార్థులను, కళాశాలపై ఎంతో నమ్మకంతో ఆదిలాబాద్‌లోని మా కళాశాలలో అడ్మిషన్ తీసుకొన్న పేరెంట్స్‌కు, పట్టుదలతో శ్రమించిన లెక్చరర్స్‌ను కళాశాల చైర్మన్ వరద రెడ్డి, డైరెక్టర్ సంతోష్ రెడ్డి అభినందించారు. జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్స్ అరవింద్ కుమార్, జైపాల్ రెడ్డి, లలిత, లెక్చరర్స్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్: ఎంతో ఆసక్తి విద్యార్థులు ఎదురు చేస్తున్న ఇంటర్ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. జిల్లా మొదటి సంవత్సరం ఫలితాల్లో తడబడిన రెండవ సంవత్సరంలో మెరుగైన ఫలితాలను సాధించింది. మార్చి 5 నుంచి 20 వరకు ఇంటర్ పరీక్షలు జరిగాయి. కాగా మంగళవారం విడులయ్యాయి. మొదటి సంవత్సరంలో 9,106 మంది పరీక్షలు రాయగా.. 4967 పాస్ అయ్యి 54.55 శాతం నమోదయ్యింది. ద్వితీయ సంవత్సరంలో 8,890 మంది పరీక్షలు రాయగా.. 6291 ఉత్తీర్ణత సాధించింది 70.76 శాతంగా నమోదైంది. కాగా ఆదిలాబాద్ జిల్లా మొదటి సంవత్సరంలో 27వ స్థానం, రెండవ సంవత్సరంలో 12వ స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరంలో మెరుగైన స్థానం రావడంలో జూనియర్ లెక్చర్ల సంఘం ఆధ్వర్యంలో డీఐఈవోను సత్కరించి స్వీట్లు తినిపించారు. ప్రణాళిక బద్ధంగా సన్నద్ధమైనందునే ద్వితీయ సంవత్సరంలో విద్యార్థులు అత్యధింగా ఉత్తీర్ణులైనట్లు డీఐఈవో గణేష్ రాథోడ్ తెలిపారు. నిత్యం విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ వహించడంతో మెరుగైన స్థానం వచ్చిందన్నారు. మొదటి సంవత్సరంలో కొంత వెనకబడిన కారణాలను తెలుసుకుంటామన్నారు. పేపర్ రీ వ్యాల్యువేషన్‌కు వారం రోజుల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మే 22 సప్లిమెంటరీ పరీక్షలు ఉంటాయని, ఫెయిల్ అయిన విద్యార్థులు సంబంధిత కళాశాలల్లో ఫీజులు చెల్లించుకోవాలని ఆయన పేర్కొన్నారు.



ప్రతిభ కనబర్చిన ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు

పసిడి పరుగులు..

(5వ పేజీ తరువాయి...)

అర్ధతులంతోనే సరిపెట్టుకునే పరిస్థితి ఏర్పడుతోంది. ఆకాశానంటుతున్న బంగారం ధరలతో పేద, మధ్యతరగతి వారు పెళ్లిలు చేసే పరిస్థితే లేదన్న టాక్ వినిపిస్తోంది.

గ్రామాల్లో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తే చర్యలు : ఎక్సైజ్ సీఐ



దేశీదారు విక్రయిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

సోనాల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా గ్రామాల్లో మద్యం విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ అన్నారు. మండలంలోని గుర్రాలతండా గ్రామంలో అక్రమంగా మహారాష్ట్ర దేశీ దారు లిక్కర్ విక్రయిస్తున్నారనే సమాచారంతో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. కాగా, అక్కడ చహాన్ సంజీవ్, నహాన్ కల్పనల వద్ద సుమారు 105 బాటిళ్ల మద్యం పట్టుబడినట్లు తెలిపారు. అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయలక్ష్మి తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయించిన తరలించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్నట్లు సమాచారం అం దిస్తే తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇందులో సిబ్బంది బాపురావు కార్తిక్, మౌనిక, అరుణ, మయూరి, తదితరులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు జొన్న పంట దగ్ధం

నేరడిగొండ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు జొన్న పంట దగ్ధ మైంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ఆడే సంతోష్, ఆడే లలితలు మూడు ఎకరాలలో జొన్న సాగు చేశాడు. పంట కోతకోసే సమయంలో ప్రమాదవశాత్తు పొలంలో మంటలు వ్యాపించి ఒక్కసారి పొలమంతా మంటలు వ్యాపించి పంటకు నిప్పంటుకుం ది. ఇతర రైతులు గమనించి సదరు రైతుకు సమాచారం అందించారు. బోరు బావుల మోటార్లు ఆన్ చేసి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే వంద శాతం పంట అగ్నికి ఆహుతైంది. సుమారు రూ.మూడు లక్షల పంట నష్టం జరిగిందని రైతు వాపోయాడు. సంబంధిత అధికారులు పంట నష్టం పరిహారం అందేలా చూడాలని రైతులు కోరారు.

కీచక ఉపాధ్యాయుడి అరెస్టు

ఆదిలాబాద్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా మావల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పీఈటీగా పని చేస్తున్న వ్యక్తిని మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపిన వివరాల ప్రకారం.. మావల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గుండి మహేష్ (54) పీఈటీగా పని చేస్తున్నాడు. పాఠశాల విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న విషయాన్ని స్టూడెంట్స్ ద్వారా తెలుసుకున్న షీ టీం ఫిర్యాదు మేరకు మహేష్‌పై మావల పోలీసు స్టేషన్‌లో ఇటీవల కేసు నమోదైంది. అలాగే యోగ టీచర్ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం వల్ల బాధిత ఉపాధ్యాయురాలు ఇచ్చిన ఫిర్యాదుతో అతనిపై మరో కేసు కూడా నమోదైంది. దీంతో మంగళవారం సదరు ఉపాధ్యాయుడు మహేష్‌ను అరెస్టు చేసినట్టు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఓ ప్రకటనలో తెలిపారు.

● ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

ఆదిలాబాద్ రూరల్: విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కాన్వెంట్ స్కూల్లో బి సేఫ్ కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఈ మేరకు విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు సైతం ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతీఒక్కరి బాధ్యత అన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతితో నిరసన

కొనసాగుతున్న ఆర్జీయూకేటీ అధ్యాపకుల నిరవధిక సమ్మె



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బాసర, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ ఒప్పంద అధ్యాపకుల నిరవధిక సమ్మె కొనసాగుతోంది.మంగళవారంతో వీరి నిరసన 14 రోజులకు చేరింది. మంగళవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు శ్రీశైలం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలకు సంబంధించి జీవో 21ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని అన్నారు. విశ్వవిద్యాలయ స్థాపన నుండి దాదాపు 17 సంవత్సరాల నుండి సేవలందిస్తున్న తమని గుర్తించి ప్రభుత్వం న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రశాంతి, రజిత, శ్రీకాంత్ ,విజయ్‌కుమార్, ప్రభాకర్‌రావు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన డీసీవో

ముథోల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోరిగాం గ్రామంలో గల పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని డీసీవో పాపయ్య గౌడ్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. త్రాగునీరు సౌకర్యం, సరిపడు గన్ని సంచులు, నీడ కొరకు టెంట్ అన్ని అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈయన వెంట సీఈవో సాయరెడ్డి, తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న భూ భారతిపై అవగాహన సదస్సులు

ముథోల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి చట్టంపై మండలంలోని చించాల, ముథోల్, వెంక టాపూర్ గ్రామాల్లో రెవెన్యూ అధికారులు మంగళవారం రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. రైతులతో కలిసి భూ భారతిచట్టంపై క్లుప్తంగా అవగాహన కల్పించారు. గతంలో ఉన్న ధరణి పోర్టల్, భూ భారతి చట్టం మధ్య ఉన్న తేడా తెలియజేస్తూ, భూ భారతితో సమస్య పరిష్కారయ్యే విధానం, విధివిధానాలు తదితర అంశాలపై క్లుప్తంగా వివరించారు. రైతులు తమ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర గవర్నమెంట్ భూ భారతి చాట్టన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. ఎలాంటి సమస్యలున్న రైతులు అధైర్యపడవద్దని సమస్య పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం దీనిని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు సలహా, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ నారాయణ పటేల్, సరస్వతి, ఎంపీడీవో శివ కుమార్, రెవెన్యూ సిబ్బంది రవి కుమార్, మౌనిక, ఈవో అన్వర్, రైతులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల నుంచి 9 మంది గురుకులానికి ఎంపిక

కుంటాల, ఏప్రిల్, 22 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని అందకూర్ ప్రభుత్వ పాఠశాల నుండి ఇటీవల విడుదలైన గురుకుల ఫలితాల్లో 9 మంది విద్యార్థులు ఎంపిక కావడం పట్ల గ్రామస్థులు ఉపాధ్యాయులను, విద్యార్థులను మంగళవారం అభినందించారు.

భూ భారతితో రైతులకు న్యాయం

నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

పెంబి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి చట్టం వలన రైతులకు న్యాయం జరుగుతుందని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతు భూములకు సంబంధించి ఏవైనా వివాదాలు ఉంటే వాటిని తొలగించి, భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ధరణి పోర్టల్‌లో లేని అనేక సమస్యలకు భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం లభించనుందని సూచించారు. ధరణిలోని వివరాల ప్రకారం... భూ భారతి రికార్డులలో వాటిని నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. అయితే రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలపై అర్జీలు అందించవచ్చని సూచించారు. ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరం ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి వచ్చేదన్నారు. భూ సమస్యలు పరిష్కరిస్తూ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే భూ భారతి చట్టం అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉందన్నారు. తహసీల్దార్ స్థాయిలో దరఖాస్తు చేసుకుంటే న్యాయం జరగలేదని భావిస్తే ఆర్డీవోకు, అక్కడ కూడా సంతృప్తి చెందకపోతే కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. భూ భారతి ద్వారా కింది స్థాయి అధికారులకు కూడా బాధ్యతలు అప్పగించారని, దీనివల్ల భూమికి సంబంధించిన చిన్న చిన్న సమస్యలు మండల స్థాయిలోనే సత్వరం పరిష్కారం అవుతాయని, భూ భారతి చట్టం వల్ల రైతులకు, పేదలకు ఎంతో మేలు కలుగుతుందని, ప్రభుత్వం అన్ని కోణాల్లో, మేధోమథనం చేసిన మీదట సమగ్ర అంశాలను పొందుపరుస్తూ భూ భారతి చట్టానికి రూపకల్పన చేయడం జరిగిందన్నారు. భూ సమస్యలను నిర్దిష్ట గడువులోపు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో రమాకాంత్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు స్వప్నిల్, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నిరంతర పర్యవేక్షణ నిమిత్తమే పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు

ఖానాపూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మస్కాపూర్ గ్రామంలో పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో నిరంతర పర్యవేక్షణ నిమిత్తం 15 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్‌రావు తెలిపారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన 15 సీసీ కెమెరాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. గతంలో పాఠశాల నుండి కంప్యూటర్ల దొంగతనం జరిగిన నేపథ్యంలో అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకే పాఠశాల భద్రత, విద్యార్థుల నిరంతర పర్యవేక్షణ తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని పాఠశాల ఆవరణలో కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, మధ్యాహ్న భోజనం, విద్యార్థులు తాగునీటి ప్లాంట్, గ్రౌండ్, తరగతి గదుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సీసీ కెమెరాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకునేలా నలుగురు ఉపాధ్యాయులతో కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో వరి గడ్డి దగ్ధం



తానూర్ , ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెంబర్ గ్రామానికి చెందిన క్యాతంవార్ విఠల్ అనే రైతుకు చెందిన వరిగడ్డి షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. రైతు వివరాల ప్రకారం... నిజామాబాద్ జిల్లాలోని బోరిగాం గ్రామం నుండి వరిగడ్డిని కొనుగోలు చేసి ట్రాక్టర్ ట్రాలీలో తీసుకువస్తుండగా మండలంలోని బెంబర్ గ్రామంలోని కాలనీలో బజార్ లైన్‌లో కరెంటు తీగలకు వరి గడ్డి తాకడంతో విద్యుత్ షాక్ సర్క్యూట్ కావడంతో వరి గడ్డికి మంటలు అంటుకుని దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో ట్రాక్టరు కూడా కాలిపోయిందని, దాదాపు రూ. 50వేల నష్టం జరిగిందని రైతు తెలిపారు. రెవెన్యూ అధికారులు చొరవ తీసుకొని ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందించేలా చూడాలని రైతు కోరుతున్నాడు.

ఉపాధికూలీలకు వసతుల ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కుభీర్‌లో కూలీల కోసం ఈజీఎస్ సిబ్బంది ఏర్పాటు చేసిన టెంట్

కుభీర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20న ఆదివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచూరితమైన ' ఉపాధి కూలీలకు వసతులు కరువు..' అనే కథనానికి స్పందన లభించింది. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో చేపడుతున్న ఉపాధిహామి పనుల వద్ద కూలీలకు కావాల్సిన వసతులు కల్పించారు. పని ప్రాంతంలో కూలీలకు టెంట్లు, తాగునీరు. ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉంచారు. కూలీలు ఉదయం 8గంటలలోపు పని ప్రాంతాలకు చేరుకొని మధ్యాహ్నం 12గంటలోపు తిరిగి ఇంటికి వెల్లాలని సూచిస్తున్నారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు.

అర్హులైన లబ్ధిదారులందరికీ ఇళ్ల మంజూరు

కుభీర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన లబ్ధిదారులందరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యేలా కృషి చేయాలని ముధోల్ మాజీ ఎమ్మెల్యే , కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జీ బోస్లే నారాయణ్‌రావుపాటిల్ అన్నారు. మంగళవారం కుభీర్ మండల ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న మాజీ ఎంపీటీసీ సభ్యులు బషీర్ పటేల్‌కు ఆయన శాలువ పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందూర్ రాందాస్, బంక బాబు, సాయికుమార్, విజయ్, ముత్యం, యోగేష్, తదితరులున్నారు.

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి రూ.20 వేల జరిమానా



జరిమానా పత్రాలు ఇస్తున్న ఎక్సైజ్ సీఐ రంగస్వామి

పెంబి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన రాజు బైండోవర్ ఉల్లంఘించినందుకు మంగళవారం రూ.20 వేల జరిమానా విధించినట్టు నిర్మల్ ఎక్సైజ్ సీఐ రంగస్వామి తెలిపారు. నిర్మల్ ఎక్సైజ్ సీఐ తెలిపిన వివరల ప్రకారం... పెంబి గ్రామానికి చెందిన రాజు గతంలో నాటుసారాయి విక్రయిస్తూ ఎక్సైజ్ అధికారులకు పట్టుబడగా అతనిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ముందు బైండోవర్ చేశామని, అయినా మళ్లీ నాటుసారాయి విక్రయిస్తూ ఎక్సైజ్ అధికారులకు పట్టుబడడంతో అతనిపై మరలా కేసు నమోదు చేసి తహసీల్దార్ ముందు హాజరుపరచి 20 వేల రూపాయల జరిమానా విధించినట్టు తెలిపారు. నాటుసారాయి తయారు చేసి, అమ్మిన, రవాణా చేసిన, సాటుసారాయి తయారీ ముడి సరుకులు నల్ల బెల్లం, పట్టిక కలిగి ఉన్న కఠిన చర్యలు తప్పవని నిర్మల్ ఎక్సైజ్ సీఐ రంగస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ ఎక్సైజ్ ఎస్సై అభిషేకర్, సిబ్బంది ఇర్ఫాన్, వెంకటేష్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



అదృశ్యమైన వర్షాల నర్సయ్య

లక్ష్మణచాంద, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన వర్షాల నర్సయ్య(47) అనే వ్యక్తి అదృశ్యమైన సంఘటన మంగళవారం తెలిసింది. ఎస్సై రహమాన్ మాలిక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 18వ తేదీన నర్సయ్య ఇంట్లో గొడవ పడి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు తిరిగి ఇంటికి రాలేదు. ఇతని ఆచూకీ కోసం అతని భార్య, అతని బంధువులు చుట్టుపక్కల గ్రామాల్లో వారి బంధువుల ఇంట్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. భార్య వర్షాల పోసాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

చికెన్‌షాపు యజమానిపై కత్తితో దాడి



నిర్మల్ రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కరెంట్ ఆఫీస్ ముందర గల చికెన్ షాప్ యజమాని అబ్దుల్‌హాకీపై మంగళవారం దాడి చేశారని టౌన్ సీఐ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం కరెంట్ ఆఫీస్ ముందర గల చికెన్‌షాప్ నిర్వహించే వ్యక్తి బాగా యాసిడ్ పోసి క్లీన్ చేస్తుండగా, పక్కనే ఉన్న మరో చికెన్ సెంటర్ యజమాని ఎందుకంత యాసిడ్ పోస్తున్నారని, బాగా వాసన వస్తుంది. కళ్లు మండుతున్నాయని అన్నందుకు పక్కనే ఉన్న ముగ్గురు వ్యక్తులు గొడవ పెట్టుకుని చేతులతో కొట్టారని, ఒక వ్యక్తి చికెన్ కొట్టే కత్తితో నాపై దాడి చేశాడని ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


ఓస రాజ్ కుమార్ (438/440)


జడ్జి మనోజ్ఞ (436/440)


బంటు సిరి వెన్నెల (432/440)

లక్ష్మణచాంద విద్యార్థులకు రాష్ట్రస్థాయి ర్యాంకులు

● మొదటి ర్యాంకు ఓస రాజ్ కుమార్

● థర్డ్ ర్యాంక్ జడ్జి మనోజ్ఞ


రాంపెల్లి శివాని (465/470)

లక్ష్మణచాంద, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో మండ లానికి చెందిన విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి రికార్డు సృష్టించారు. హైదరాబాద్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో చదువుతున్న మండలానికి చెందిన ఓస రాజ్‌కుమార్ (లక్ష్మణచాంద) బైపీసీలో 440 మార్కులకు 438 మార్కులతో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు సాధించాడు. అలాగే హైదరాబాద్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో చదువుతున్న జడ్జి మనోజ్ఞ (పొట్టపెల్లి(కే)) 436 మార్కులతో తృతీయ ర్యాంక, బంటు సిరి వెన్నెల 432 (మల్లాపూర్) మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. అలాగే టి. అంకిత 422 మార్కులు సాధించి కస్తూర్బా కళాశాల టాపర్‌గా నిలిచారు. ఎం పీసీ విభాగంలో 470 మా ర్కులకు రాంపెల్లి శివాని 465 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధిం చగా, సిహెచ్.లక్ష్మీ441 మా ర్కులు సాధించి ఉత్తమంగా నిలిచారు. సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను సాత్విక్ 960 (సహకార జూనియర్ కళాశాల), కే.రాఘవి 958 (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం) మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచారు. బైపీ సీ విభాగంలో శైలజ 957 మార్కులు (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం) సాధించి ఉత్తమంగా నిలిచింది. కస్తూర్బా గాంధీ కళాశాల 100శాతం ఉత్తీర్ణత సాధించి రికార్డు సృష్టించగా, సహకార జూనియర్ కళాశాల 95శాతం ఉత్తీర్ణత సాధించింది. ఉత్తమంగా రాణించిన విద్యార్థులను తల్లిదండ్రులతో పాటు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అభినందించారు.

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

దిలావర్‌పూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మంగళవారం విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో దిలావర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ పలితాలు సాధించారు. మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో ఉత్తీర్ణత శాతం 94శాతం, ద్వితీయ సంవత్సరంలో 88శాతం, ఒకేషనల్ విభాగంలో మొదటి సంవత్సరంలో 78 శాతం, ద్వితీయ సంవత్సరంలో 96శాతం ఉత్తీర్ణత సాధించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.సుదర్శన్ తెలిపారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య 90 రోజుల యాక్షన్ ప్రణాళిక రూపొందించడం వల్ల మంచి ఫలితాలు సాధించడానికి అవకాశం ఏర్పడిందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో బి.నవీన్ 416, బైపీసీ విభాగంలో పి.జ్ఞానేశ్వరి 362, సీఈసీ విభాగంలో బి.విష్ణువర్ధన్ 388, ఏ అండ్ టీ విభాగంలో డి.వంశీ 466, ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో కే. సాయికుమార్ 937, ఎస్.అమూల్య 856, బైపీసీ విభాగంలో ఎం.సువర్ణ 848, ఎన్.శృతి 806, సీఈసీ విభాగంలో ఎస్‌కే. పర్వీన్ 761, ఎన్. మానస 704, ఏ అండ్ టి విభాగంలో డి. ముత్యం 886, జే. భూమేష్ 827 మార్కులు సాధించారు.

కేజీబీవీలో వంద శాతం ఉత్తీర్ణత

దిలావర్‌పూర్ కస్తూర్బా బాలికల విద్యాలయం జూనియర్ కళాశాల విద్యార్థినిలు ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో 59 మంది బాలికలు పరీక్షలకు హాజరు కాగా, 59మంది బాలికలు ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 53 మంది విద్యార్థినులకు గాను 53 మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో పి.శైలజ 470కి 423 మార్కులు, సుస్మిత 420మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో బి.అర్చన 440 మార్కులకు 427, కే.అలేఖ్య 426 మార్కులు, ద్వితీయ సంవత్సరం బైపీసీ విభాగంలో కే.పూజ 1000 మార్కులకు గాను 946, ఏ. సవిత 933మార్కులు సాధించారు. ఎంపీసీ విభాగంలో ఎస్.మీనాక్షి 915, ఎల్.దీక్షిత 906 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన బాలికలను కేజీబీవీ ప్రత్యేక అధికారి అపర్ణ అభినందించారు.


వినయ్, ఎంపీసీ 951/1000


బాలు, బైపీసీ 937/1000


దాసరి ప్రసన్న, ఎంపీసీ 440/470


ఎస్. ప్రియాంక, సీఈసీ 442/500


బి. రుక్షిక, ఎంపీసీ 939/1000


బి. సునీత, బైపీసీ 983/1000

ఇంటర్ ఫలితాల్లో ముధోల్ విద్యార్థుల ప్రతిభ

ముథోల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదల కావడంతో మండలంలోని ఆయా కళాశాలల్లోని విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ముథోల్‌లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మొదటి సంవత్సరంలో 90 శాతం, ద్వీతీయ సంవత్సరంలో 97 శాతం ఫలితాలు వచ్చినట్లు సంబంధిత ప్రిన్సిపాల్ నర్సింహా రెడ్డి తెలిపారు. ఇందులో ఎంపీసీ విద్యార్థి సిహెచ్. వినయ్ 1000 మార్కులకు గాను 951 రాగా బైపీసీలో పి.బాలు 937 మార్కులు సాధించారు. అలాగే మొదటి సంవత్సరంలో ఎంపీసీలో ఎన్.సాయికిరణ్‌కు 435 మార్కులు సాధించాడు. బైపీసీలో గంగోలి 440కు గాను 398 మార్కులు సాధించారు. అలాగే తెలంగాణ ట్రైబర్ వెల్ఫేర్ బాలికల కళాశాలలో ఫస్ట్ ఇయర్‌లో 92 శాతం రాగా సెకండ్ ఇయర్‌లో 97శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ఇందులో రెండో సంవత్సరం బైపీసీలో విద్యార్థి పవర్‌రాణి 1000కి 968మార్కులు సాధించింది. ఎంపీసీవిద్యార్థి జాదవ్ పల్లవి 898 మార్కులు సాధించారు. మొదటిసంవత్సరంలో ఎంపీసీలో ఆడే సౌందర్య 419, బైపీసీలో రాథోడ్ లత 410 మార్కులు సాధించారు. అలాగే మైనార్టీ బాలికల కళాశాలలో మొదటి సంవత్సరంలో 88శాతం, ద్వితీయ సంవత్సరంలో 96శాతం ఉత్తీర్ణత సాధించగా ఎంపీసీ విద్యార్థి అంకిత 935 మార్కులు రాగా బైపీసీ విద్యార్థి సలీమా 971 మార్కులు సాధించారు. అలాగే జ్యోతి బాపూలే కళాశాలలో మొదటి సంవత్సరంలో 95శాతం, ద్వితీయ సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంపీసీలో రుక్షిక 939, బైపీసీలో సునీత 983, సీఈసీలో శృతి 880 మార్కులను సాధించగా మొదటి సంవత్సరంలో ఎంపీసీలో ప్రసన్న 440, బైపీసీలో స్రవంతి 431, సీఈసీలో ప్రియాంక 442 మార్కులను సాధించారు. కస్తూరిభాలో మొదటి సంవత్సరంలో 78 శాతం ఉత్తీర్ణత సాధించగా ద్వితీయ సంవత్సరంలో 95 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. మొదటి సంవత్సరంలో ఎంపీహెచ్ డబ్ల్యూ విద్యార్థి వైష్ణవి 500లకు 477 మార్కులు, సీఈసీలో ప్రియాంక 366 సాధించగా ద్వితీయ సంవత్సరం విద్యార్థి 1000 మార్కులకు ఎంపీహెచ్‌డబ్ల్యూలో రాణి 994 మార్కులు సాధించారు. సీఈసీలో రాణి 851మార్కులు సాధించారు. అలాగే గీర్వాణి కళాశాలలో మొదటి సంవత్సరంలో 60 శాతం, ద్వితీయ సంవత్సరంలో 55 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో మనోజ్‌కుమార్ 966, బైపీసీలో భాగ్యశ్రీ 838 మార్కులను సాధించినట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో ఆల్ఫోర్స్ విద్యార్థుల ప్రభంజనం

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఆల్ఫోర్స్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభను కనబర్చినట్లు కళాశాల చైర్మన్ నరేందర్ రెడ్డి తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో జేనవ్యశ్రీ 1000 మార్కులకు 993, భావన 991 మార్కులు, ద్వితీయ సంవత్సరం బైపీసీ విభాగంలో కవాల్ ప్రీత్‌కౌర్ 1000కి 995 మార్కులు, సుమయ్యఖానం 994 మార్కులు, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 470కి ప్రసూన 468, కీర్తి 468, కృష్ణవేణి 468 మార్కులతో రాష్ట్రస్థాయి టాపర్లుగా నిలిచినట్లు తెలిపారు. ప్రథమ సంవత్సరం బైపీసీ విభాగంలో 440 మార్కులకు సుమ ఫిర్దోస్ 438, నబీల తహరీన్ 438, జోహా మహవీష్ 438 రాష్ట్రస్థాయి టాపర్లుగా నిలిచినట్లు వెల్లడించారు.

ఇంటర్ ఫలితాల్లో తానూర్ విద్యార్థుల ప్రతిభ

తానూర్,ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ద్వితీయ సంవత్సరం బైపీలో 977 మార్కులు సాధించిన హెచ్.రాము కళాశాల టాపర్‌గా నిలిచాడు. ఎంపీసీలో 964తో బి సాయిశివానీ టాపర్‌గా నిలిచినట్లు ప్రిన్సిపాల్ ఫణిరాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఫణి రాజశేఖర్ అభినందనలు తెలిపారు.

కేజీబీవీలో వంద శాతం ఉత్తీర్ణత


డి. అనూష (990/1000)

నర్సాపూర్(జి), ఏప్రిల్22 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులు ఇంటర్ ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రతిభ కనబరిచారు. 184మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో ఏ.వైష్ణవి 445 మార్కులు, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో డి.అనూష 990మార్కులు, బైపీసీలో బి.రుచిత 967 మార్కులుసాధించి టాపర్లుగా నిలిచారు. వీరందరినీ ఎస్‌వో వీణ, ఉపాధ్యాయులు అభినందించారు.

జైనథ్ కేజీబీవీలో 79శాతం ఉత్తీర్ణత

జైనథ్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కేజీబీవీలో ఇంటర్ ఫలితాల్లో 79 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రత్యేక అధికారి వీణాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 1000 మార్కులకు ఎంపీహెచ్‌డబ్ల్యులో ఎస్.దివ్యభారతి 960 మార్కులకు సీఈసీలో ఎస్.స్వప్న 810 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. ఫస్టియర్‌లో జి.పాయల్ 500 మార్కులకు గాను 480 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారని ప్రత్యేక అధికారి వీణాకుమారి తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో ఉట్నూర్ విద్యార్థుల ప్రభంజనం


సారా మహమూద్ (975/1000)

ఉట్నూర్, ఏప్రిల్22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల్లో ఉట్నూర్ ప్రాంత విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. పూలాజిబాబా జూనియర్ కళాశాలలో బైపీసీ ద్వితీయ సంవత్సరంలో ఆఫ్రీకాత క్రిమ్ 978 మార్కులు సాధించగా ఎంపీసీలో శ్రీనివాస్‌యాదవ్ 953 మార్కులు సాధించాడు. అలాగే ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో రాథోడ్ శివసాయికుమార్ నాయక్ 453 మార్కులు సాధించగా, బైపీసీలో వాగ్‌మారే లావణ్య 414 మార్కులు సాధించినట్లు డైరెక్టర్ రితేష్ రాథోడ్, ప్రిన్సిపాళ్లు మల్లారెడ్డి, శేషులు తెలిపారు. అదేవిధంగా ఉట్నూర్ మండలకేద్రంలోని చైతన్య జూనియర్ కళాశాలవిద్యార్థులు ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో బైపీసీలో సారా మహమూద్ 975 సాధించి ప్రథమస్థానంలో ఉండగా ఆడే సిద్ధు 964 మార్కులతో ద్వితీయ స్థానంలో, రాథోడ్ సంధ్యారాణి 959 మార్కులతో తృతీయ స్థానంలో ఉన్నారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం ఫలితాలలో తిలావత్ అరుణ్‌నాయక్ 970 మార్కులు సాధించి ప్రథమస్థానంలో, కురిసింగరాం సుహాస్ 950 మార్కులు సాధించి ద్వితీయస్థానంలో, చౌహాన్ నవీన్ కుమార్ 940 మార్కులు సాధించి తృతీయస్థానంలో నిలిచారు. సీఈసీలో చౌహాన్ సుశత్ 836 మార్కులు, పెందూరు పార్వతి 758 మార్కులు సాధించినట్లు నిలిచారని ప్రిన్సిపాల్ బూర్గుల ప్రకాష్ తెలిపారు. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాలో బైపీసీ విభాగంలో నికం అనూష 419 మార్కులు, ఆడే సిద్ధార్థ 415 మార్కులు, ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో అంజు కన్వర్ 457 మార్కులు, మాలవత్ యువరాజ్ 440మార్కులు సాధించారని నిలిచారన్నారు. ఉట్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఈసీ ద్వితీయ సంవత్సరంలో త్రివేనవ్య 804, ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో రమ్య 897, బైపీసీ ద్వితీయ సంవత్సరంలో సిడాం వెన్నెల 887 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ ధనరాజ్ తెలిపారు. మైనార్టీ జూనియర్ కళాశాలలో హెచ్‌ఈసీ ద్వితీయ సంవత్సరంలో షేక్ మక్సుద్ 857 మార్కులు, సీఈసీ ద్వితీయ సంవత్సరంలో కౌశిక్ 891 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ వనిత తెలిపారు. ఉట్నూర్ లాలిటేకిడి గురుకుల జూనియర్ కళాశాలలో 90శాతం ఫలితాలు వచ్చాయని, ఎంపీసీలో సంతోష్941, బైపీసీలో సచిన్939 మార్కులు, సీఈసీలో వెంకటేశ్ 844మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఇమాముద్దీన్ తెలిపారు.


ఎస్.సోని, బైపీసీ 399


కె.ఓంకార్, ఎంపీసీ 409


జె.దీపిక, బైపీసీ 929

ఇంటర్‌లో సత్తాచాటిన మోడల్ స్కూల్ విద్యార్థులు


పి.గణేష్, ఎంపీసీ 905

నార్నూర్, ఏప్రిల్22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్ ఫలితాలు సత్తాచాటారు. 94శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ప్రశాంత్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగం నుంచి జి.జగదీష్ 917, పి.గణేష్ 905 సాధించి కాలేజ్ టాపర్‌గా నిలిచారు. బైపీసీ విభాగంనుంచి జె.దీపక 929, ఆర్.మానస 924తో టాపర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ నుంచి కె.ఓంకార్ 409 బైపీసీ ఎస్.సోని 399 టాపర్‌గా ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

దీక్ష విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

నిర్మల్‌రూరల్, ఏప్రిల్22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దీక్ష జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. వెంకటొరెడ్డి తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ ఫలితాల్లో జి.శ్రీనిత్య 467, ఇక్ర నూరిన్ 466, మహినూర్ ఫిర్దోస్ 462, నిఖిల్ 461, బైపీసీ విభాగంలో సామీహ సదా 435, ఫాతిమా ఉన్నిసా బేగం 427, దీపిక 424, అక్షయ 424, సీ ఈసీలో రింజియ్ 488, నీరు కున్వర్ 480, ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో రోహన్ 991, ఐశ్వర్య 982, కృష్ణ 981, బైపీసీ విభాగంలో గం గోత్రి 993, సోహ ఫాతిమా 987, అంకుష్ 981, సీఈసీ విభాగంలో 977 మార్కులు సాధించారని తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో మెరిసిన లోకేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు

లోకేశ్వరం, ఏప్రిల్22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో లోకేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మొత్తం విద్యార్థులు 106కు గాను 85 మంది ఉత్తీర్ణులయ్యారు. 80 శాతం ఫలితాలు వచ్చాయి. అలాగే ద్వితీయ సంవత్సరంలో 108కి గాను 105 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 97శాతం ఫలితాలు వచ్చాయని కళాశాల ప్రిన్సిపాల్ కే.గౌతమ్ అన్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ఎంపీసీ గ్రూపు నుంచి సీహెచ్. అనిరుద్ 470 మార్కులకు గాను 431 మార్కులు సాధించాడు. అలాగే ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ బైపీసీ గ్రూపు నుంచి రమ ప్రియ 440 మార్కులకు 362 మార్కులు సాధించింది. అలాగే ఇంటర్ ఫస్ట్ ఇయర్ సీఈసీ గ్రూప్ నుంచి అనికేత్ 500 మార్కులకు గాను 372 మార్కులు సాధించాడు. ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్, సెకండర్ ఇయర్‌లో అత్యధిక మార్కులు సాధించిన కాలేజీ విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

ఇంటర్‌లో సత్తాచాటిన ఆదర్శ విద్యార్థులు


ఏ. సౌమ్య, ఎంపీసీ 986


సిహెచ్. రచన, బైపీసీ 967


ఎన్. హర్షిక, ఎంఈసీ 945


పీ. గనుశ్రీ, ఎంపీసీ 458

కుంటాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో కుంటాల ఆదర్శ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 93 శాతం, రెండవ సంవత్సరంలో 94 శాతం ఉత్తీర్ణత సాధించారు. పీ.గనుశ్రీ ఎంపీసీ మొదటి సంవత్సరంలో 458 మార్కులు, వీ.స్వప్న బైపీసీ మొదటి సంవత్సరం 431 మార్కులు, కే. వినతి బైపీసీ మొదటి సంవత్సరంలో 431, ఎం.భోజన్న ఎంఈసీ మొదటి సంవత్సరంలో 416 మార్కులు సాధించగా ఏ. సౌమ్య ఎంపీసీ రెండవ సంవత్సరంలో 986 మార్కులు, సీహెచ్ రచన బైపీసీలో 967, ఎన్.హర్షిక ఎంఈసీ రెండవ సంవత్సరంలో 945 మార్కులు సాధించారు.


వీ. స్వప్న, బైపీసీ 431


కే. వినతి, బైపీసీ 431


ఎం. భోజన్న, ఎంఈసీ 416

ఆదిలాబాద్‌లో 44 డిగ్రీల ఉష్ణోగ్రత

● అత్యధికంగా తాంసిలో నమోదు

ఆదిలాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లో ఠారెత్తిస్తున్న ఎండలతో పగటి ఉష్ణోగ్రతలు భారీగా పెరిగి పోతున్నాయి. మంగళవారం జిల్లా నగటు గరిష్ట ఉష్ణోగ్రత 43.8 డిగ్రీలు కాగా కనిష్టంగా 29.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.అలాగే అత్యధికంగా తాంసి మండలంలో 44.0 తలమడుగులో 43.9,మావలలో 43.8, బీంపూర్‌లో 43.7, సిరికొండలో 43.5, బోథ్‌లో 42.8, బోరజ్‌లో 40.4డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నాలుగైదు రోజులుగా జిల్లా వ్యాప్తంగా 40 డిగ్రీలకు పైగానే పగటి ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో అధికారులు ఆరెంజ్ అలర్ట్‌ను ప్రకటించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.ఉదయం నుంచి రాత్రి వరకు తీవ్రమైన ఉష్ణోగ్రత లతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు.ఎండల తీవ్రతతో రైతులు పనులు ముగించుకొని మధ్యాహ్నం సమయంలో విశ్రాంతి తీసుకుంటు ఇండ్లకే పరిమితమవు తున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లోనే వ్యవసాయ పనులను చేపడుతున్నారు. జిల్లాపై మరికొన్నాళ్ల పాటు వడగాలుల ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు.


ఎండల తీవ్రతకు నిర్మానుష్యంగా కనిపిస్తున్న పట్టణంలోని ప్రధాన కూడళ్లు


కేంద్రం నిధులతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

● మండలానికి రూ. రెండు కోట్లలతో అభివృద్ధి పనులు: ఎంపీ జి. నగేష్

తలమడుగు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని అదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ అన్నారు. మంగళవారం తలమడుగు మండల బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఎంపీ నగేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పరిచేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా కోట్లాది రూపాయలను సిసి రోడ్ల నిర్మాణం కోసం మంజూరు చేయడం జరి గిందన్నారు. ఇందులో భాగ అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలానికి ఎన్ఆర్‌టీజి ఎస్‌సిసి రోడ్ల నిర్మాణానికి రూ. కోటి 50వేలు రూపాయల నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. అలాగే అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న కొలం ఆదివాసుల గిరిజనుల అభివృద్ధి కోసం కోలం గిరిజన గ్రామాలకు రూ. ఒక కోటి 80 లక్షల నిధులు, తలమడుగు మండలానికి కేంద్రం నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. మండలానికి 2 కోట్ల 80 లక్షల 50వేల రూపాయలు అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసిన ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్‌కు మండల బీజేపీ నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసి సన్మానించారు. కార్యక్రమం లో బీజేపీ జిల్లా సీనియర్ నా యకులు కనపర్తి చంద్రకాంత్, మాజీ జెడ్పీటీసీ జక్కుల ప్రభాకర్, బీజేపీ జిల్లా యువ సీనియర్ నాయకులు బోండ్ల వెంకట స్వామి మాజీ సర్పంచ్ మహేందర్ యాదవ్, బీజేవైఎం మండల అధ్యక్షులు దాతాజీ కిరణ్, గిరిజన మోర్చా అధ్యక్షులు పాయల్ జ్ఞాందేవ్ శార్థ స్వామి, నారాయణరెడ్డి, మోహన్ రెడ్డి అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, రాంజీ, సంతోష్, ప్రేమేందర్ రెడ్డి, రామ్ రెడ్డి, రజినీకాంత్, కోరండ్ల పురుషోత్తం, శ్రీనివాస్ రెడ్డి, కైలాస్, కిష్టు శైలేందర్, తదితరులు పాల్గొన్నారు.


ఎండ నుంచి ఉపశమనం కలిగేలా కూల్ గాగుల్స్‌ను పెట్టుకుని విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ట్రాఫిక్ పోలీసులకు కూల్ గాగుల్స్

తీవ్రమైన ఎండలోను విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు ఉపశమనం కలిగించేలా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు వారికి కూల్‌గాగుల్స్‌ను అందించారు. గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న ప్రస్తుత తరుణంలోను ప్రధాన రహదారులపై విధులు నిర్వహిస్తున్నవారు కొంత సాంత్వన పొందేందుకు ఇవి ఉపయోగపడుతున్నాయి.

● (ఆంధ్రజ్యోతి ఆదిలాబాద్ స్టాఫ్‌ఫొటోగ్రాఫర్)

భూముల అక్రమ రిజిస్ట్రేషన్లపై కలెక్టర్‌కు ఫిర్యాదు

బోథ్, ఏప్రిల్22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర గ్రామ పంచాయతీ పరిధిలోని 47, 48/ఆ, 53/ఆ, 50/ఈ,ఉ భూ ములలో 380 ప్లాట్లు చేశారని పాట్ల యజమానులు కలెక్టర్ ఇచ్చిన ఫిర్యాదులు పేర్కొన్నారు. అయితే ఈ భూముల్లో 80శాతం ప్లాట్లు అయ్యేశారని, అందులో నుంచి పెద్దమొత్తంలో ఎల్ఆర్ఎస్ కట్టారని వివరించారు. అయితే విద్యాసాగర్ రావు అనే వ్యక్తి మరికొందరు వ్యక్తులతో కలిసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని మండలానికి చెందిన భీమ, గంగామ్మలు, దివాకర్ రెడ్డి అనే వ్యక్తుల పేరును రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం జరిగిందని వారు వివరించారు. తహశీల్దార్ ఈ విషయంలో కొందరు వ్యక్తులకు తలొగ్గి ఈనెల 7న రిజిస్ట్రేషన్ చేశారని, తాము కొన్నప్లాట్లు సైతం వ్యక్తులకు రిజిస్ట్రేషన్ అయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని ప్లాట్ల కొనుగోలుదారులు కలెక్టర్‌కు విన్నవించారు.

గంజాయి తాగుతున్న ముగ్గురిపై కేసు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ పట్టణంలోని 1వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు. పట్టణంలోని తీర్పెల్లి స్మశాన వాటిక వెనకాల పట్టణానికి చెందిన సర్ఫుద్దీన్, మసూద్, జితేంద్ర, ఓంప్రకాష్ గంజాయి తాగుతుండగా పట్టుబడ్డారు. వీరిపై కేసు నమోదుచేసి, సర్ఫుద్దీన్‌ను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

వేడుక ఏదైనా..
సందర్భం ఎటువంటిదైనా
వివాహ వార్షికోత్సవం
స్వదేశీ, విదేశీయానం
లీగల్ ప్రకటనలు
పదవీ విరమణ
శ్రద్ధాంజలి
జన్మదినం
షష్టిపూర్తి
జయంతి
వర్ధంతి
క్లాసిఫైడ్స్
మీ స్నేహితులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులకు ఆంధ్రజ్యోతిలో ప్రకటనల ద్వారా అతి తక్కువ రేట్లకే శుభాకాంక్షలు తెలియజేయండి
ఆంధ్రజ్యోతి
ప్రకటనల కొరకు సంప్రదించండి
ఆదిలాబాద్: 99854 11291
నిర్మల్ : 80966 77672
యాడ్స్ మేనేజర్ : 99854 11453

ప్రజావాణి ఫిర్యాదుతో అధికారుల విచారణ

నర్సాపూర్(జి), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అర్లీ(కే) గ్రామంలో గత ఆదివారం జేసీబీతో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయని సామాజిక మాధ్యమంలో వీడియో వైరల్ అయ్యింది. వారం రోజులపాటు ఉపాధి హామీ కూలీ పనులు నిలిచిపోయాయి. సోమవారం అర్లీ(కే) గ్రామస్థులు జిల్లా కేంద్రంలోని ప్రజా ఫిర్యాదుల విభాగంలో పనులు కొనసాగించాలని, తవ్విన మొరాన్ని గ్రామంలోని ఆలయాల వద్ద ఉపయోగించామని, సామాజిక మాధ్యమంలో వైరల్ అవుతున్న వీడియోలపై విచారణ జరపాలని గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఎంపీడీవో పుష్పలత, ఏపీఎం జగన్నాథ్, టెక్నికల్ అసిస్టెంట్ రవీందర్ విచారణ చేపట్టారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలియజేశారు.

తునికాకు కల్లం కలేనా?



- టైగర్ జోన్‌గా ఏర్పడిన నాటి నుంచి కవ్వాల్ అభయారణ్యంలో ఆకు సేకరణపై ఆంక్షలు
- గతంలో ఖానాపూర్ డివిజన్ పరిధిలో కొనసాగిన రెండు యూనిట్లు
- మధ్యప్రదేశ్ తునికాకు రాకతో.. స్థానిక తునికాకుపై కాంట్రాక్టర్లలో తగ్గిన మక్కువ
- కాంట్రాక్టర్లు రాకపోవడంతో తునికాకు కల్లాల నిర్వహణ చేయడం లేదంటున్న అధికారులు

నిర్మల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు వేసవి వచ్చిందంటే చాలు.. అడవితల్లిని నమ్ముకొని బతికే ఆదివాసీలకు, నిరుపేద ప్రజలకు కల్పతరువులా ఉపయోగపడి వారికి ఆదాయం సమకూర్చిపెట్టే తునికాకు సేకరణపై కవ్వాల్ అభయారణ్యంలో ఆంక్షలు కొనసాగుతున్నాయి. దట్టమైన అడవులకు ప్రసిద్ధిగాంచిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని కవ్వాల్ అభయారణ్యంలో తునికాకు చెట్లు నేటికీ విరివిగా దర్శనమిస్తున్నాయి. అటవీ శాఖాధికారులు ఆంక్షలు విధిస్తుండడంతో ఈ ఆకు సేకరణకు వెళ్లే నిరుపేదలు నిరుత్సాహానికి గురవుతున్నారు. నాడు నిరుపేదల పాలిట వరంగా ఉన్న తునికాకు.. నేడు కళ్ల ముందు కనిపిస్తున్న ఈ ప్రకృతి వనరును కనీసం ఉపయోగించుకోలేని పరిస్థితిని కల్పిస్తున్న అధికారుల తీరు పట్ల పలువురు బాహాటంగానే అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు రాష్ట్రవ్యాప్తంగా 14 జిల్లాలలో తునికాకు సేకరణ నిర్వహిస్తూ ఆయా జిల్లాల పరిధిలో క్షేత్రస్థాయిలో తునికాకు కొనుగోలు యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు. అయా యూనిట్ల పరిధిలో కల్లాల నిర్వహణ చేస్తూ తునికాకును సేకరిస్తున్నారు. కానీ నిర్మల్ జిల్లాలో మాత్రం తునికాకు సేకరణపై అటవీశాఖ అధికారులు నిషేధం విధించడం సరికాదని జిల్లాలోని ఆదివాసీ గిరిజనులతో పాటు బీడీ కార్మికులు పలువురు నిరుపేద కూలీలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా తిరిగి తునికాకు సేకరణ యూనిట్లను ప్రారంభించాలని కోరుతున్నారు.


ఖానాపూర్ అడవిలో తునికి చెట్టు

● టైగర్ జోన్ ఏర్పాటుతో ఆంక్షలు మరింత కఠినం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాలను కలుపుతూ ఉండే దట్టమైన అభయారణ్యమైన కవ్వాల్‌ను పెద్దపులుల సంరక్షణకు అనువైన ప్రాంతంగా గుర్తించి 2012లో ఈ అభయారణ్యాన్ని కవ్వాల్‌టైగర్ రిజర్వ్‌జోన్‌గా మార్చారు. నాటి నుంచి అడవుల్లో పెద్దపులి ఆవాసం ఏర్పరచుకునేందుకు ఏర్పాట్లను ప్రారంభించారు. ఇందులో భాగంగా ఎన్నో శాఖాహార, మాంసాహార జంతువుల పెంపకాలను యుద్ధ ప్రాతిపదికన మొదలుపెట్టారు. నాటి నుంచి అడవుల్లోకి కనీసం పశువులను మేపేందుకు కూడా వెళ్లవద్దని ఆంక్షలు ప్రారంభమయ్యాయి. నేడు ఈ అభయారణ్యంలో పెద్దపులి సహా ఇతర మాంసాహార, శాఖాహార జంతువులు సంచరిస్తుండడంతో తునికాకు సేకరణకు వెళ్లే వారిని నియంత్రించాలని ఇక్కడి అధికారులు ఆంక్షలు విధిస్తున్నారు. తునికాకు సేకరణ నిషేధమని, అడవుల్లోకి ఆకు సేకరణకు వెళ్లవద్దని బహిరంగ ప్రకటనలు చేస్తున్నారు. దీంతో గత వందల ఏళ్లుగా ఇక్కడ నిరుపేదలకు పని దొరకని వేసవి కాలంలో జీవనాధారంగా నిలిచే తునికాకు సేకరణ నిలిచిపోయింది. ఎప్పుడైనా.. ఎక్కడో చోట ఆకు సేకరణకు ఎవరైనా వెళ్తే అటవీశాఖ అధికారులు వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెబుతున్నారు.

● అభయారణ్యంలో విరివిగా తునికాకు

తెలంగాణ రాష్ట్రంలో బీడీ కార్మికులు ఉపయోగించే తునికాకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో విస్తారంగా లభిస్తుంది. ఇక్కడి అడవుల్లో సమయానికి తునికాకు సేకరించేలా గతంలో అటవీశాఖ అధికారులే చర్యలు చేపట్టేవారు. సదరు ఆకు సేకరించిన తర్వాత రెండు యూనిట్ల ద్వారా ఒక్కో యూనిట్ పరిధిలో ఆరు కల్లాల వరకు నిర్వహిస్తుండేవారు. గతంలో ఒక్క నిర్మల్ జిల్లా ఖానాపూర్ డివిజన్ పరిధిలోనే 12 తునికాకు కల్లాలను నిర్వహించే వారని అధికారులు చెబుతున్నారు. సదరు తునికాకు కల్లాల ద్వారా ప్రభుత్వానికి సైతం ఆదాయం సమకూరేది. ఇటు నిరుపేదలకు ఆదాయ వనరుగా.. ప్రభుత్వానికి ఆదాయ వనరుగా ఉన్న తునికాకు సేకరణ నిలిచిపోవడంతో రెండువైపులా నష్టం జరుగుతోంది. మరోపక్క ఇక్కడ అడవుల్లో విరివిగా ఉన్న తునికాకు ముదిరిపోయి నేలరాలి పోతుంది.

● మధ్యప్రదేశ్ ఆకు రాకతో తగ్గిన ప్రాధాన్యం

మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని అడవుల్లో లభించే తునికాకు కొనుగోలు చేయడం ద్వారా తమకు లాభం చేకూరుతుందనే ఆలోచనతో కాంట్రాక్టర్లు బీడీ ఆకు సేకరణలో మధ్యప్రదేశ్ నుంచి వచ్చే దిగుమతులకే ప్రాధాన్యత కల్పిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో తునికాకు అమ్మకాలు స్టాండర్డ్‌బ్యాగ్ పద్ధతిన (వెయ్యి కట్టలకు ఒక స్టాండర్డ్ బ్యాగ్) ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఒక స్టాండర్డ్‌బ్యాగ్‌కు గాను రూ.1450 చెల్లిస్తారు. మధ్యప్రదేశ్‌లో కిలోల చొప్పున తునికాకును విక్రయిస్తుంటారు. దీంతో ఎస్బీ పద్ధతిన కొనుగోళ్ల కంటే కిలోల చొప్పున కొనుగోలు తమకు కలిసొస్తాయని కాంట్రాక్టర్లు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో తునికాకు కొనుగోలుకు ప్రాధాన్యతనిస్తున్నారు. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో దొరికే ఆకు సేకరణకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. ఒకవేళ కాంట్రాక్టర్లు ముందుకు వస్తే తునికాకు కల్లాలను నిర్వహించేందుకు తమకు ఎటువంటి అభ్యంతరం లేదని అటవీ శాఖాధికారులు స్పష్టం చేస్తున్నారు. నాడు ఈ ప్రాంతంలో లభించే తునికాకుతో ఇటు ప్రభుత్వానికి, అటు నిరుపేదలకు ఆదాయం లభించినట్లుగానే నేడు సైతం తిరిగి కల్లాల నిర్వహణను నిర్వహించాలని ఈ ప్రాంత ప్రజల నుంచి డిమాండ్ ఊపందుకుంటోంది. అలాగే అడవుల్లోకి తునికాకు సేకరణకు వెళ్లే వారి పట్ల ఆంక్షలు విధించకుండా.. తునికాకు సేకరణకు వెళ్లే వారికి అటవీ జంతువుల నుంచి రక్షణ కల్పించేలా అటవీశాఖ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.


తునికి చెట్ల ఆకులు సేకరిస్తున్న యువకుడు

జిల్లాలో తునికాకు సేకరణను తిరిగి ప్రారంభించాలి

నంది రామయ్య, సీపీఐ (ఎంఎల్ మాస్‌లైన్)
ప్రజాపంథా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి

జిల్లాలో కవ్వాల్ టైగర్ జోన్‌గా ఏర్పడక ముందు ఈ ప్రాంత అడవుల్లో లభించే తునికాకును ఇక్కడ ఆదివాసీలు, గిరిజనులు, నిరుపేదలు విరివిగా సేకరించి ఉపాధి పొందేవారు. నేడు టైగర్ జోన్ ఏర్పాటుతో తునికాకు సేకరణపై అటవీ శాఖ అధికారులు ఆంక్షలు విధిస్తున్నారు. కల్లాలను ఎత్తివేశారు. దీంతో సహజసిద్ధంగా ఈ అడవుల్లో లభించే తునికాకు ప్రతి ఏడాది వృథాగా పోతోంది. తిరిగి తునికాకు సేకరణను ప్రారంభించి ఈ ప్రాంత నిరుపేదలకు ఉపాధి కల్పించాలి. అలాగే కల్లాల నిర్వహణతో ప్రభుత్వానికి సైతం ఆదాయం వస్తుంది.

కాంట్రాక్టర్ ముందుకు వస్తే తునికాకు సేకరణకు అనుమతిస్తాం

నాగినిభాను (ఇన్‌చార్జి డీఎఫ్‌వో, నిర్మల్)

కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతోనే నిర్మల్ జిల్లాలో తునికాకు సేకరణను నిలిపి వేశాము. భవిష్యత్తులో కాంట్రాక్టర్లు ముందుకు వస్తే తునికాకు సేకరణను తిరిగి పునఃప్రారంభించేందుకు ఎటువంటి ఇబ్బంది లేదు. స్థానికులు, కాంట్రాక్టర్లు ముందుకు వస్తే కల్లాల నిర్వహణను మళ్లీ ప్రారంభిస్తాం..

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులంతా క్రమబద్ధీకరించుకోవాలి

● జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఎల్‌ఆర్‌ఎస్ (లే అవుట్ల క్రమబద్ధీకరణ)కు దరఖాస్తు చేసుకున్న వారిలో ఆమోదం పొందిన దరఖాస్తుదారులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణకు ఆర్థికభారం తగ్గించేందుకు ప్రభుత్వం గ్రామీణ, పట్టణ ప్రాంతల పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ రిజిస్ట్రేషన్ రుసుములో 25 శాతం రాయితీ కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులంతా రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించాలని తెలిపారు. ఏప్రిల్ 30వ తేదీతో ఈ రాయితీ అవకాశం ముగుస్తుందన్నారు. కావునా దరఖాస్తుదారులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని త్వరితగతిన రుసుములు చెల్లించాలని అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో గురుకుల బాలికల విజయభేరి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణం సోఫీనగర్ గురుకుల జూనియర్ కళాశాల బాలికలు మంగళవారం వెలువబడిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ ఫలితాల్లో విజయభేరి మోగించారు. ప్రైవేట్‌కు దీటుగా రాష్ట్ర ర్యాంకులు సాధించి మెప్పించారు. ఎంపీసీ (ద్వితీయ)లో సుప్రియ 992 మార్కులతో రాష్ట్ర ర్యాంకు సాధించింది. గజ్జమొళ్ల అవంతిక 991, మాలెపు అక్షయ 989, శ్రీహర్షవిన 989, రేగుంట సింధూర 988 మార్కులు సాధించింది. బైపీసీలో రాథోడ్ అంజలి 993 మార్కులతో స్టేట్ ర్యాంక్ సాధించింది. జి. అన్విత 986, తునికి శ్రీనిధి 982 సాధించింది. ఎంపీసీ (ప్రథమ) శార్వాణి, శ్రీవల్లి 465, సంధ్యారాణి 464, కీర్తన 463 మార్కులు సాధించింది. బైపీసీలో అక్షయ 435 స్టేట్ ర్యాంక్ సాధించగా విజయలక్ష్మి, కీర్తన 433, వైష్ణవి 432 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు. మొదటి సంవత్సరంలో 5,483 విద్యార్థులకు గాను 3,223 మంది 58.78 శాతం ఉత్తీర్ణులు కాగా ద్వితీయ సంవత్సరంలో 5,211కు గాను 3,693 మంది విద్యార్థులు 70.87 శాతం ఉత్తీర్ణులయ్యారు.

చిరుత దాడిలో లేగ దూడ మృతి


లేగ దూడను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

తానూర్ , ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) 22 : మండలంలోని బెంబర్ గ్రామానికి చెందిన చేపూరే గణేష్ అనే రైతు యొక్క లేగ దూడ చిరుత దాడిలో మృతి చెందింది. రైతు, అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... రైతు గణేష్ సోమవారం రాత్రి తనకున్న వ్యవసాయ చేనిలో ఆవులు, లేగ దూడలు కట్టి మేత వేసివచ్చాడు. మంగళవారం ఉదయం చేనులోకి వెళ్లి చూసే సరికి లేగ దూడ రక్తపు మడుగులో మృతి చెంది ఉంది. లేగ దూడ చిరుత దాడిలో మృతి చెంది ఉంటుందని గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా వారు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఎఫ్ఆర్‌వో సట్ల వేణుగోపాల్, ఎఫ్ఎస్‌వో లక్ష్మణ్, ఎఫ్‌బీవో కృష్ణ, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డా. రాజేశ్‌లు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా చిరుత పులి దాడిలో లేగ దూడ మృతి చెందినట్లు వారు నిర్ధారించారు. బెంబర్ శివారులో ప్రాంతంలో, కోలూర్, మొగ్లి, అటవీ ప్రాంతాల్లో చిరుత సంచారం ఉన్నందున రైతులు జాగ్రత్తగా ఉండాలని అటవీశాఖ అధికారులు తెలిపారు. తమ పశువులను ఇంటి దగ్గర ఉండే విధంగా చూసుకోవాలన్నారు.


చిరుత దాడిలో మృతి చెందిన లేగ దూడ

ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పారదర్శకంగా జరగాలి

- భూభారతి చట్టం ద్వారా ప్రజల భూ సమస్యల పరిష్కారానికి కృషి
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పేదల సొంతింటి కలను సాకారం చేసే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇళ్ల పథకంలో లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన సచివాలయం నుంచి సీఎస్ శాంతికుమారి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ గౌతమ్‌తో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి తొలి విడతలో 3,500ల ఇళ్లు మంజూరు చేశామని, ఏప్రిల్ 30లోపు దరఖాస్తులపై ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ కమిటీ ఆమోదించిన జాబితాలో ఎవరైనా అనర్హులు ఉంటే తక్షణమే తొలగించాలని తెలిపారు. బేస్మెంట్ దశ పూర్తి చేసిన లబ్ధిదారులకు మొదటి విడత కింద లక్ష రూపాయలు ఇప్పటికే విడుదల చేసినట్టు తెలిపారు. సామాగ్రి ధరలు కృత్రిమంగా పెరగకుండా చర్యలు తీసుకోవాలని, ఇసుక కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పట్టణల్లో జీ+3 మోడల్ ఇళ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులను తాత్కాలికంగా నియమించి శిక్షణ నందిస్తున్నట్టు వెల్లడించారు. భూ భారతి చట్టాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు జిల్లా స్థాయిలో వర్క్‌షాప్‌లు నిర్వహించాలని మంత్రి సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ గడువు మరలా పొడిగింపు ఉండదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ.. జిల్లాలో భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సుల వివరాలు, మండలాల వారీగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని మంత్రి సీఎస్‌కు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్, ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

● భూ భారతితో రైతులకు మేలు : కలెక్టర్

దస్తురాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి చట్టంతో రైతులకు మేలు జరుగుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన భూ భారతి అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూ భారతి చట్టంతో భూములకు సంబంధించిన సమస్యలకు సులభంగా పరిష్కారం లభిస్తుందన్నారు. అనంతరం భూ భారతి చట్టంపై రైతులకు క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఏఎంసీ చైర్మన్ పడిగెల భూషణ్, నాయబ్ తహసీల్దార్ యాదవ రావు, సీనియర్ సహాయకులు సంతోష్, ఆర్ఐ ఆర్తి, జూనియర్ అసిస్టెంట్ సూరజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుర్గం మల్లేష్, యూత్ అధ్యక్షుడు గుండ నరేష్, కాంగ్రెస్ నాయకులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాలి

● రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి


పరిసరాలను పరిశీలిస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్

సారంగాపూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించి పాఠశాలలోని తరగతి గదులను వంట గదితో పాటు పాఠశాలలో పరిసరాలను పరిశీలించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాలని అన్నారు. ప్రతి రోజు విద్యతో పాటు యోగా కార్యక్రమాలను నేర్పించాలన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండేలా ఉపాధ్యాయులందరు కృషి చేయాలని పేర్కొన్నారు. పాఠశాలలోని పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉండడంతో హర్షం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులను పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట అదనపు కలెక్టర్, సైజాన్ అహ్మద్, డీఈవో రామారావు, కళాశాల ప్రిన్సిపల్ సంగీత, ఎంఈవో మధుసుదర్‌లతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

కొత్తగూడెంలో రోడ్డుపై వేసిన టెంట్‌ను తొలగించాలి

● తహసీల్దార్‌కు గ్రామస్థుల వినతి

ఖానాపూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రంగపేట గ్రామ పంచాయతీ పరిధిలో కొత్తగూడెం గ్రామంలో గత 45 రోజులుగా రోడ్డుపై వేసిన టెంట్‌ను వెంటనే తొలగించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఖానాపూర్ తహసీల్దార్ సుజాతను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన కూతురు అల్లుడితో కలిసి ప్రస్తుతం నెలకొన్న స్థల వివాదం తాలూకు స్థలంలో ఉన్న ఓ పార్టీ కార్యాలయాన్ని కూల్చేశారన్నారు. దీంతో గ్రామంలో 45 రోజులుగా వివాదం కొనసాగుతోందన్నారు. ఆ స్థలం ప్రస్తుతం అటవీ శాఖ అధికారులు ఆధీనంలోకి తీసుకొని బేస్‌క్యాంప్ నిర్మాణం చేసుకున్నారన్నారు. వెంటనే అక్కడ నిర్మాణం చేసిన బేస్‌క్యాంప్‌ను తొలగించి తిరిగి పార్టీ కార్యాలయానికి ఆ స్థలాన్ని కేటాయించాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య కోరారు. గత 25 ఏళ్ల క్రితం తన నాయకత్వంలో జరిగిన పోరాటంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలను సాధించుకోవడంతో పాటు పార్టీ కార్యాలయానికి సైతం స్థలాన్ని కేటాయించుకున్నామన్నారు. ఇట్టి స్థలాన్ని గత కొద్ది రోజులుగా కొంతమంది వివాదాస్పదం చేస్తున్నారని దీనిపై కలెక్టర్ సహా స్థానిక ఎమ్మెల్యే వాస్తవాలను పరిశీలించాలని కోరారు. 45 రోజులుగా గ్రామంలో ప్రజలకు రాకపోకలకు దారి లేకుండా సీసీ రోడ్డును మూసి వేసి టెంట్ వేసి ఇబ్బందులకు గురిచేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఖానాపూర్ మండల కార్యదర్శి ఎం.అంకుశరావు, మండల నాయకులు జక్కుల రాజన్న, ఎం. లింగు, ఆత్రం భీమ్‌రావు, కురుమ రాజన్న, పూసం లక్ష్మణ్, కొమరం మంత్, కొత్తగూడెం గ్రామస్థులు మాదాసు బుచ్చవ్వ, గోనె లక్ష్మీ, అక్కల లక్ష్మీ, కాలువ లక్ష్మీ, నస్పూర్ లింగవ్వ, శేఖర్, వెంకటేష్ తదితరులున్నారు.



ఘనంగా ప్రపంచ ధరిత్రి దినోత్సవం


ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

సోన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడ్తాల్ ప్రభుత్వ పాఠశాలలో ప్రపంచ ధరిత్రి దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఆర్.రమేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాధికారి టి.పరమేశ్వర్ మాట్లాడుతూ... నీటిని పొదుపుగా వాడి కాపాడుకుందామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలలో విజేతలకు మండల విద్యాధికారి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విజయవాణి, మంగమ్మ, రాధ, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు బీసీ ఉద్యమ నేతల సమావేశం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని పెన్షనర్ల సంఘ భవనంలో బుధవారం ఉదయం 11 గంటలకు బీసీ ఉద్యమ నేతల ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు బీసీ ఉద్యమ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో మహాత్మాజ్యోతి బాపూలే దంపతుల విగ్రహాల ఏర్పాటు, బీసీ భవన నిర్మాణం తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్టు తెలిపారు. అన్ని సంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయండి



వాల్‌పెయింట్ వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కుంటాల, ఏప్రిల్, 22 : (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ అన్నారు. మంగళవారం మండలంలోని కల్లూరు గ్రామంలో రజోత్సవ సభకు సంబంధించిన వాల్‌పెయింట్ వేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27 న వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ అధ్వర్యంలోనే ఇట్టి వర్గాల వారికి న్యాయం చేకూరుతుందని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు అసంతృప్తితో ఉన్నారని రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీదే అధికారమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నిర్మల్ జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు పెంట ధశరథ్, కన్వీనర్ పడకంటి దత్తు, డా.శ్రీనివాస్, రజనీకాంత్, లోకేష్, రమేష్, వంశీ, రవి, సతీష్, తదితరులు ఉన్నారు.

భూ భారతితో రైతులకు న్యాయం : తహసీల్దార్

నర్సాపూర్(జి), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి చట్టం వలన రైతులకు న్యాయం జరుగుతుందని తహసీల్దార్ సోమ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని టెంబుర్ని గ్రామంలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూ భారతి చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించారు.